నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

3 | వరంగల్, గురువారం 15 ఆగస్టు 2024 | MAHABUBABAD

జెండాతో కవాతు చేస్తున్న ఎన్‌సీసీ కెడెట్లు

జెండా పట్టి.. సెల్ఫీ కొట్టి

ఓరుగల్లు కోటలోని సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగుతున్న చిన్నారులు

హర్ ఘర్ తిరంగాలో భాగంగా చారిత్రక ఓరుగల్లు కోట లోని కీర్తితోరణాల మధ్య కేంద్ర పురావస్తు శాఖ ఏర్పా టుచేసిన సెల్ఫీ పాయింట్ వద్ద పర్యాటకులు పిల్లలు, పెద్దలు ఇలా సెల్ఫీ దిగుతూ మురిసిపోయారు. అలాగే ఖిలా వరంగల్ కోటలో చేతిలో జెండాతో ఎన్‌సీసీ కెడెట్లు తీసిన కవాతు ఆకట్టుకున్నది.

- వరంగల్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 14

త్రివర్ణ కాంతుల్లో మెరిసెన్

- జెండా పండుగ వేళ సరికొత్త శోభ
- విద్యుద్దీపాలతో రామప్ప, వరంగల్ రైల్వేస్టేషన్, కలెక్టరేట్లు కళ కళ
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్లు

త్రివర్ణ కాంతుల్లో వెలిగిపోతున్న రామప్ప ఆలయం

విద్యుత్ దీపాల వెలుగుల్లో వరంగల్ రైల్వే స్టేషన్

జెండా పండుగ వేళ పలు కట్టడాలు త్రివర్ణ కాంతుల్లో మెరిసిపోయాయి. కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల్లో వెంకటాపూర్‌లోని రామప్ప ఆలయం, వరంగల్ రైల్వేస్టేషన్, కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు సరికొత్త శోభ సంతరించుకున్నాయి.

- ఖిలా వరంగల్ / వెంకటాపూర్, ఆగస్టు 14

ములుగులోని తంగేడు మైదానంలో ముస్తాబైన వేదిక

జెండా పండుగకు సర్వం సిద్ధమైంది. ఈమేరకు ఉమ్మడి వరంగల్ లోని ఆరు జిల్లాల్లో గురువారం స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా పరేడ్ గ్రౌండ్లు ముస్తాబయ్యాయి. అలాగే మంత్రులు, ఇన్‌చార్జీల చేతుల మీదుగా పతాకావిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాలను తెలిపే స్టాళ్ల ఏర్పాట్లు, స్వాతంత్ర్య సమరయోధులకు సత్కారాలు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులు, సిబ్బందికి పురస్కారాలు, తదితర ఏర్పాట్లపై ఇటు అధికార యంత్రాంగం, బందోబస్తుపై పోలీసు శాఖ పర్యవేక్షిస్తున్నది.

సార్లు చెప్పారట.. సున్నం వేయాలట!

పండ్రాగస్టు వేళ ఇదేం పని సారూ?

పండ్రాగస్టు పండుగొచ్చిదంటే బడి పిల్లలకు ఎంత సంబురమో! ఉదయం లేచింది మొదలు స్కూల్ డ్రెస్ మంచిగ ఇస్తిరి చేసుకొని, జేబుకు మూడు రంగల బ్యాడ్జ్ తగిలించుకొని, చేతిలో జెండాతో వాడవాడలా తిరిగి మురిసిపోతుంటారు. అందు కోసం ముందు రోజు నుంచే ఉత్సాహంగా ఏర్పాట్లు చేసుకుంటుంటారు. కానీ ఇక్కడో బాలుడు మాత్రం ఆ సంబురమేదీ లేకుండా బడిగోడలకు సున్నం వేస్తూ కనిపించాడు. సార్లు చెప్పారని బ్రష్ చేత పట్టుకుని మహబూబాబాద్ సమీపంలోని జామండ్లపల్లి ఎస్టీ హాస్టల్ గోడకు పెయింట్ వేస్తూ బుధవారం 'నమస్తే' కెమెరాకు చిక్కాడు. లోలోపల బాధపడుతూ కనీసం ఒంటిపై బట్టలు కూడా లేకుండా దీనంగా కనిపించిన దృశ్యం అక్కడున్న వారిని కలచివేసింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న వేళ భావిభారత పౌరులకు మీరు చెప్పే పాఠాలు ఇవేనా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

- మహబూబాబాద్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 14

ప్యాక్స్‌లో అక్రమాల కలకలం!

- రుణమాఫీ అమలుతో బయటకొస్తున్న వైనం
- ఇప్పటికే నాలుగు సంఘాల్లో సస్పెన్షన్ల పర్వం
- నల్లబెల్లి పీఏసీఎస్ చైర్మన్, కార్యదర్శి, ఆపరేటర్‌పై క్రిమినల్ కేసులు
- రైతుల ఫిర్యాదులపై మొదలైన విచారణ
- మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

వరంగల్, ఆగస్టు 14(నమస్తే తెలంగాణ) : వరంగల్ జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. రైతు రుణమాఫీని అమల్లోకి రావడంతో పలువురు కార్యదర్శులు, సిబ్బంది అవినీతి వెలుగులోకి వస్తున్నది. ఇప్పటికే వివిధ ఆరోపణలతో జిల్లాలోని నాలుగు సంఘాల్లో సస్పెన్షన్ల పర్వం కొనసాగింది. నల్లబెల్లి, సంగెం, దుగ్గొండి, గీసుగొండ మండలం చింతలపల్లి, మందపల్లి, వంచనగిరి పీఏసీఎస్‌ల కార్యదర్శులు నలుగురు, నల్లబెల్లి పీఏసీఎస్ డీటీపీ ఆపరేటర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి (డీసీవో) బి సంజీవరెడ్డి వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు అక్రమాలపై విచారణకు ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన 2023 డిసెంబర్ 9లోపు రైతులు రుణం పొందినప్పటికీ ఆయా పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది తప్పిదం, అక్రమాల వల్ల అనేక మంది రుణమాఫీని కోల్పోతున్నారు. దీంతో వారు సంఘాలకు చేరుకొని రికార్డులు పరిశీలిస్తుండడంతో అధికారులు, సిబ్బంది నిర్వాకం బయటపడుతున్నది.

నల్లబెల్లిలో క్రిమినల్ కేసులు

ప్రధానంగా నల్లబెల్లి పీఏసీఎస్‌పై అధికార యంత్రాంగం స్పెషల్ ఫోకస్ పెట్టినట్లు కనపడుతున్నది. ఈ పీఏసీఎస్ కార్యదర్శి, డీటీపీ ఆపరేటర్‌పై ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేసిన అధికారులు తాజాగా చైర్మన్ సీహెచ్ మురళీధర్, కార్యదర్శి ఎన్ మొగిలి, డీటీపీ ఆపరేటర్ వైనాలపై నల్లబెల్లి పోలీసు స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అనేక రకాల ఫిర్యాదులు వస్తుండటంతో సహకార శాఖలోని ఆడిట్ అధికారి వాల్యానాయక్, నర్సంపేట ఏరియా ఆడిట్ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కీర్‌నాయక్ విచారణ ప్రారంభించారు. ఈ పీఏసీఎస్‌లోని సుమారు 2,500 రుణ దరఖాస్తులను పరిశీలించి మూడు రోజుల్లో నివేదిక అందజేయాలని డీసీవో సంజీవరెడ్డి విచారణ అధికారులను ఆదేశించారు. మూడు రోజుల్లో విచారణ జరిపి నివేదిక అందజేయాలని అధికారులకు గడువు విధించారు.

తప్పు ఎవరు చేసినా చర్యలు

- సంజీవరెడ్డి, డీసీవో

ఆరోపణలొచ్చిన పీఏసీఎస్‌ల్లోని అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నం. తప్పు ఎవరు చేసినా చట్టపరంగా చర్యలు తప్పవు. జిల్లాలో ప్రస్తుతం నాలుగు పీఏసీఎస్‌ల్లో వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. నల్లబెల్లి పీఏసీఎస్‌లో మూడు రోజుల్లో విచారణ జరిపి నివేదిక అందజేయాలని గడువు నిర్దేశించాం. అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తిస్తుంది. పీఏసీఎస్‌ల్లో తప్పులు జరిగితే రైతులకు న్యాయం చేస్తాం.

- బీఆర్ఎస్ భరోసా

కార్యకర్తల కుటుంబాలకు బీమా మంజూరు పత్రాలు

రోడ్డు ప్రమాదాలు, ఇతర కారణాలతో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు మృతిచెందగా వారి కుటుంబాలకు బీఆర్ఎస్ భరోసానిచ్చింది. ఈ మేరకు రూ.2 లక్షల ఇన్సురెన్స్ మంజూరు కాగా ఆర్డర్ కాపీలను బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ జనరల్ సెక్రెటరీ సోమ భరత్‌కుమార్ చేతులమీదుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు కార్యకర్తల కుటుంబసభ్యులు అందుకున్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ బుకీ అరెస్ట్

రూ.32లక్షలు, మూడు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం

సుబేదారి, ఆగస్టు 14 : ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ అమాయకులను మోసం చేస్తున్న బుకీ (ఏజెంట్)ను పోలీసులు పట్టుకొని రూ. 32 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. హనుమకొండ గోపాల్‌పూర్ వెంకటేశ్వరకాలనీకి చెందిన మాడిశెట్టి ప్రసాద్ క్రికెట్ బెట్టింగ్ బుకీ (ఏజెంట్)గా పని చేస్తూ, మహారాష్ట్రకు చెందిన సునీల్ సాయంతో బెట్టింగ్ నిర్వహించేవాడు. ఇద్దరు కలిసి www.nice7777.pro వెబ్‌సైట్ ద్వారా అమాయకులను నమ్మించి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ జనరేట్ చేసి 12 అకౌంట్ల ద్వారా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు తీసుకునేవారు. ఈ క్రమంలో ఇంగ్లాండ్‌లో జరుగుతున్న 100 బాల్స్ క్రికెట్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తుండగా, పక్కా సమాచారంతో ప్రసాద్‌ను పట్టుకొని నగదు, మూడు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకొని నిందితుడు ప్రసాద్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

విధులు బహిష్కరించి జూడాల నిరసన

- ఎంజీఎం, జనగామ ఆర్టీసీ చౌరస్తాలో ధర్నా
- మద్దతు పలికిన ఐఎంఏ సభ్యులు, నర్సింగ్ విద్యార్థులు

ఎంజీఎం హాస్పటల్‌లోని గాంధీ విగ్రహం ముందు నిరసన తెలియజేస్తున్న జూనియర్ డాక్టర్లు

జనగామ, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ)/వరంగల్ చౌరస్తా : కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు ధర్నా చేశారు. బుధవారం అత్యవసర సేవలు మినహా విధులు బహిష్కరించారు. హత్యకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఎంజీఎం దవాఖాన జూనియర్ డాక్టర్లు ర్యాలీ చేపట్టి గాంధీ విగ్రహం ముందు ధర్నా చేయగా జనగామలోని ఆర్టీసీ చౌరస్తాలో డాక్టర్స్ అసోసియేషన్, జూనియర్ డాక్టర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ హాస్పిటల్ అండ్ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేస్తే అక్కడి ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులకు రక్షణ కరువవుతున్నదని, కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని రూపొందించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంజీఎంలో వైద్య విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థినులకు ప్రత్యేక విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళికి వినతిపత్రం అందజేశారు. ఎంజీఎంలో నిరసనలో ఐఎంఏ సభ్యులు, నర్సింగ్ విద్యార్థులతో పాటు బీజేపీ నేత, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు.